
అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెయిన్‌లలో పేరుకుపోయిన మట్టిని తీయించాలని, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పనులు చేపట్టాలని, పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో వరదనీటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ రమేష్‌బాబు, డీఈలు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూమిలో

ఇంటి నిర్మాణ అనుమతులను రద్దు చేయాలి : సీపీఎం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూమిలో ఇంటి నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ.. తారామతిపేట గ్రామంలోని సర్వే నంబర్ 215, 16,17లో భూదాన్ భూమిలో ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి మంజూరు చేశారని ఆరోపించారు. కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుండె శివకుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఎల్‌బీనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తూ మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సరూర్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందనడానికి రైతు రుణమాఫీ ఉదాహరణ అని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, బేర బాలకిషన్, నల్లెంకి ధన్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బండి మధుసూదన్‌రావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరుణ, మొగిళ్ల మల్లేష్, కందాడి జంగారెడ్డి, నయీమ్, యూనుస్, కట్ట శ్రీనివాస్ ముదిరాజ్, నర్సింగ్ పాల్గొన్నారు.

దేశచరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం


సుభాష్ చందర్జీని సన్మానిస్తున్న కొండేటి శ్రీధర్

సైదాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దేశచరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయమని మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ అన్నారు. ఆయనను మంగళవారం సైదాబాద్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సన్మానించారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ వల్ల 1975 నుంచి 1977 వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని వివరించారు. రాజ్యాంగ హక్కులను హరించి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా నియంతృత్వ పాలన కొనసాగిందన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టు చేయాలన్నారు. దోస్త్ ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య వస్తే కళాశాలలోని సహాయ కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు. వెబ్ ఆప్షన్లు జూలై 3వ తేదీ వరకు ఇవ్వవచ్చన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు దోస్త్ కో-ఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి(ఫోన్ నంబర్ 9441065762), టెక్నికల్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ (ఫోన్ నంబర్ 9666338001)ను సంప్రదించవచ్చన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

చాదర్‌ఘాట్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ, కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, సీజీఎల్, సీహెచ్ఎస్ఎల్ తదితర పోటీ పరీక్షలకు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్ విజేత స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ ఇస్తుందని డైరెక్టర్ వీజేరెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సంబంధిత కోర్సుల ధ్రువీకరణ పత్రాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతున్నాయని, మూడు నుంచి నాలుగు నెలల పాటు సాగే ఇంటెన్సివ్ కోచింగ్‌లో ప్రతిరోజూ, వారం పరీక్షలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. వివరాల కోసం విజేత స్టడీ సర్కిల్, యూనియన్ బ్యాంక్ పైన రెండో అంతస్తులో, మెట్రో పిల్లర్ నంబర్ 1531, దిల్‌సుఖ్‌నగర్‌లో నేరుగా గాని, లేదా 9949308999, 9908480999, 9908470999 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి గణపతి హోమం

చంపాపేట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి గణపతి హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు ఎస్.భార్గవశర్మ, చంద్రకాంత్ శర్మ, అర్చకులు కందాళ సంతోష్‌కుమార్, జి.శ్రీనివాస్, లక్ష్మణ్, ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, ముక సురేందర్‌రెడ్డి, చేగోని సురేష్‌గౌడ్, గూడూరు మధుసూధన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పనామా చౌరస్తాలో

అండర్ పాస్ వద్దు

● ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రజలకు సౌకర్యం
● సామ రంగారెడ్డి

వనస్థలిపురం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా వనస్థలిపురంలోని దుర్గావిలాస్ నుంచి ఆటోనగర్ వరకు నిర్మించే రోడ్డు అండర్ పాస్ పనులు చేపట్టకుండా ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. పనామా వద్ద అండ్‌పాస్ కాకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అండర్ పాస్ నిర్మించడం వల్ల మన్సూరాబాద్‌లో, సుష్మా చౌరస్తాలో పలు కాలనీలకు వెళ్లే రహదారులు మూసుకుపోయే ప్రమాదం ఉందన్నారు. రహదారికి ఇరువైపుల ఉన్న వ్యాపార సముదాయాలకు అంతరాయం కలిగే విధంగా రోడ్డు పనులు చేపట్టవద్దన్నారు. రోడ్డు విస్తరణ పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకటొరెడ్డి పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే పనులను చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, బద్దం ప్రేమ్ మహేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు రవీందర్ గౌడ్, అంజన్‌కుమార్, విజయ్‌కుమార్, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలి

బర్కత్‌పుర, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధర గ్యారంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి దేశవ్యాప్తంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సంయుక్త కిసాన్‌మోర్చా ప్రతినిధులు వీస్సా కిరణ్‌కుమార్, టి.సాగర్, మురళీధర్‌రెడ్డి, కన్నెగంటి రవి, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రాలు ఇస్తున్న రుణమాఫీలో సగం కేంద్ర ప్రభుత్వం భరించాలని వారన్నారు. రైతులు పండించిన అన్నిరకాల పంటలకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు గ్యారంటీ చేయాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారని, రైతు రుణాలను మాత్రం మాఫీ చేయలేదని విమర్శించారు.

పదేళ్ల మోదీ పాలనలో దేశవ్యాప్తంగా 1.09 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వారు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, రైతులను ఆదుకుంటామని ప్రగల్భాలు పలికిన మోదీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. 2017లో మధ్యప్రదేశ్‌లో ఉల్లి రైతులపై కాల్పులు జరిపించి ఆరుగురు రైతుల ప్రాణాలను బలికొన్న శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా నియమించడం దుర్మార్గమని, ఆయనను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆగస్టులోగా రైతులకు రుణమాఫీ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఒకే విడతలో రుణమాఫీ చేయాలని కోరారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు

రైతులు బలంగా ఉన్న రాష్ట్రాలలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పారని, ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలను విడనాడకపోతే రైతుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రైతుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి జూలై 10న ఢిల్లీలో సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని, దీనిలో దేశవ్యాప్తంగా రైతు సంఘాల నేతలు పాల్గొని ఉద్యమకార్యాచరణ రూపొందిస్తారని వారు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యం

వనస్థలిపురం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడితే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఇండియా కూటమి నేతలు అసత్య ప్రచారం చేసినా దేశ ప్రజలు మరోసారి ఎన్డీయే కూటమికి పట్టం కట్టారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ అన్నారు. మన్సూరాబాద్‌లోని ఎంతంరెడ్డి గార్డెన్స్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిలా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎమర్జెన్సీ డే నిర్వహించారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రదీప్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ రోజులను ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని దేశం మొత్తం తిరిగినా కాంగ్రెస్ పార్టీ కూటమిని ప్రజలు ఆదరించలేదన్నారు. ప్రజలకు అనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తుందని గుర్తుచేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేయడమే భారతీయ జనతాపార్టీ లక్ష్యం అన్నారు. అనంతరం నల్ల రిబ్బన్లు కట్టుకుని బీజేపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, నవజీవన్ రెడ్డి, నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, రవీందర్ గౌడ్, రామేశ్వర్, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాకీర్ అలీ హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

చాంద్రాయణగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన జాకీర్ అలీ హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ బి. యాదగిరి స్వామి వివరాలు వెల్లడించారు. హసన్‌నగర్ షోయబ్ కాలనీకి చెందిన జాకీర్ అలీ(29) డ్రైవర్. అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ వివాహితతో ఐదు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమె కుమార్తెపై కూడా కన్నేశాడు. ఆ మహిళ అతడిని ఎన్నిసార్లు వారించినా వినకపోవడంతో సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన మహ్మద్ షఫీ(31)కి విషయం చెప్పింది. షఫీ కూడా నచ్చజెప్పినా జాకిర్ అలీ వైఖరి మార్చుకోలేదు. ఈనెల 21న జాకిర్ మహిళ ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఆమె భర్త, మహ్మద్ షఫీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. క్షణికావేశంలో షఫీ ఇనుపరాడ్‌తో తలపై కొట్టడంతో జాకీర్ అలీ స్పృహ తప్పిపడిపోయాడు. చనిపోయాడో లేదో అని షఫీ, ఆమె భర్త కలిసి జాకీర్ అలీకి స్కిప్పింగ్ తాడుతో ఉరివేశారు. షఫీ, మహిళ భర్తను అరెస్టు చేశామని, ఆమె పరారీలో ఉందని ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ యాదగిరి

రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో ప్రధాని ప్రకటన చేయాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక రిజర్వేషన్లపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు చౌరస్తాలోగల బీసీ భవన్‌కార్యాలయంలో ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27శాతం రిజర్వేషన్లను కల్పించిన మాజీ ప్రధాని, స్వర్గీయ వీపీ సింగ్ (విశ్వనాథ్ ప్రతాప్ సింగ్) 93వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.


వీపీ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని మోదీ బీసీలకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విజయ్ భాస్కర్, బీసీ నేతలు బూడిద మల్లికార్జునయాదవ్, పానుగంటి విజయ్, మాదేశీ రాజేందర్, వీరమల్ల కార్తీక్, ప్రవీణ్‌యాదవ్, జాజుల భాస్కర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో

సమస్యలను పరిష్కరించాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. వైద్యులు, నర్సుల ఖాళీలను భర్తీ చేయాలని, కోరారు. నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో సమస్యలపై ఆర్ఎంఓ డాక్టర్ శ్రీదేవికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రజా ఆరోగ్యం విషయంలో చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ కోరారు. నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేవని, మందుల కొరత ఉందని తెలిపారు. ఓపీ వార్డు పై కప్పు పెచ్చులు ఊడి పడ్డాయన్నారు. కార్యక్రమంలో షేక్ మహమూద్, మజీద్ అలీఖాన్, కళ్యాణ్, బాలు, విజయ్, వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాలరులను బెదిరించి

డబ్బులు లాక్కున్న రౌడీషీటర్

నార్సింగ్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టుకుంటున్న జాలరులను బెదిరించిన ఓ రౌడీషీటర్ వారి వద్ద డబ్బు లాక్కున్నాడు. నార్సింగ్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన ఇర్ఫాన్ సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి పీరంచెరువు కట్టపై మద్యం తాగాడు. అదే సమయంలో చెరువులో చేపల వేటకోసం వలలు వేసేందుకు వచ్చిన ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్‌కుమార్ అతడి సహచరుల వద్దకు ఇర్ఫాన్, అతడి మనుషులు వెళ్లారు. 'ఇప్పటికే అనేక మర్డర్లు చేశాను. వారం రోజుల క్రితమే జైలు నుంచి వచ్చాను. మిమ్మల్ని చంపి మళ్లీ జైలుకు పోతాను' అంటూ ఇర్ఫాన్ కత్తితీసి జాలార్ల ముందు తిప్పడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. జేబులో ఎంత ఉంటే అంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో సందీప్‌కుమార్ జేబులో ఉన్న రూ.11 వేలు ఇర్ఫాన్‌కు ఇచ్చేసి అక్కడి నుంచి పారిపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇర్ఫాన్ కోసం గాలిస్తున్నారు. గతంలో పీరంచెరువు వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్న సమయంలో ఇర్ఫాన్ ద్విచక్ర వాహనాన్ని కాల్చివేసి హంగామా సృష్టించాడు. ఈ కేసులో అతడు జైలుకెళ్లి వచ్చాడు.

నాలా నిర్మాణ పనుల పరిశీలన

చంపాపేట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఉదయ్‌నగర్‌కాలనీలో నాలా నిర్మాణ పనులను కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి కాలనీ ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు బుచ్చిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య, భగవాన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయ్‌నగర్‌కాలనీలో నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నల్ల రఘుమారెడ్డి



విద్యా దీక్షలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు తదితరులు

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

● సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు

వనస్థలిపురం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్ చేశారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎల్‌బీనగర్ మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యా దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యాసంస్థల ఇంటిగ్రేటెడ్ పద్ధతిని పైలెట్ ప్రాజెక్ట్‌గా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి అమలు చేయాలన్నారు. కార్పొరేట్ విద్యావ్యవస్థను తక్షణమే కట్టడిచేసి అందరికీ సమాన విద్యను అందజేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు సామాజికవేత్తలు, రాజకీయ, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ జయశ్రీ

బోనాల ఉత్సవాల్లో సమన్వయంతో పనిచేయండి

● అధికారులతో సమీక్షా సమావేశంలో తహసీల్దార్

సైదాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ సూచించారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మలక్‌పేట, సైదాబాద్, మాదన్నపేట, సంతోష్‌నగర్, ఐఎస్‌సదన్ పోలీసులు, జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


వారాహిదేవి నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తదితరులు

6 నుంచి వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు

ఎల్‌బీనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాలపీఠం వారాహి సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో జూలై 6 నుంచి 14వ తేదీ వరకు వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆలయంలో నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ను భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలలో ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు విశేష అభిషేకం, 10.30 గంటలకు కుంకుమార్చన, సాయంత్రం 6 గంటలకు పారాయణము, లలిత, విష్ణు సహస్రనామాలు, సౌందర్యలహరి, హనుమాన్ చాలీసా పారాయణాలు ఉంటాయన్నారు. రాత్రి 7.30 గంటలకు మహా నక్షత్ర హారతులు జరుగుతాయన్నారు. జూలై 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు లక్ష బిల్వార్చన, 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు లక్ష పుష్పార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.


ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

ఉచిత వైద్య శిబిరంలో 450 మందికి పరీక్షలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డి పాలెంలోని వర్డ్ అండ్ డీడ్ క్యాంపస్‌లో మంగళవారం యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్, ఇండియా మెడికల్ మిషన్ సంయుక్తాధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 450 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్య, గిరిజ, భరత్, మేరీ విజయ తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షకు 208 మంది అభ్యర్థుల హాజరు

కొత్తపేట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): న్యూ నాగోల్‌లో సీఐఓఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మంగళవారం నిర్వహించిన టీజీపీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు 208 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185 మంది అభ్యర్థులకుగాను 104 మంది హాజరుకాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో కూడా 185 మందికి 104 మంది హాజరయ్యారు.